సాక్షి
వికారాబాద్

సోమవారం : 15 : జూలై : 2024



సమస్యల షాదీఖానా..

మైనార్టీల సౌకర్యార్థం కొడంగల్ పట్టణ కేంద్రంలో నిర్మించిన షాదీఖానా శిథిలావస్థకు చేరింది. 8లో▸



పత్తిలో పూత పద్ధతి మేలు

పేను బంక, దోమల నివారణకు పూత పద్ధతి ఎంతో మేలని మండల వ్యవసాయాధికారి జయశంకర్ పేర్కొన్నారు. 8లో▸



పత్తాలేని ప్రత్యేకాధికారులు

గ్రామ పంచాయతీల్లో నిధులు లేక కొట్టుమిట్టాడుతున్నాయి. బోరు మోటార్లు పాడైన పట్టించుకునే వారే లేరు. 9లో▸

న్యూస్‌రీల్

అనంతుడి సేవలో కలెక్టర్ దంపతులు



ఆశీర్వచనం అందజేస్తున్న అర్చకులు

అనంతగిరి: వికారాబాద్ సమీపంలోని అనంత గిరిగుట్ట శ్రీఅనంత పద్మనాభ స్వామిని ఆదివారం కలెక్టర్ దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారికి ఘన స్వాగతం పలికింది. ఆలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆలయ చరిత్ర, విశిష్టతను, స్వామి వారి మహత్యాన్ని వివరించారు. తీర్థప్రసాదాలు ఇచ్చి ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ నరేందర్, ట్రస్టీ పద్మనాభం తదితరులు ఉన్నారు.

‘కేపీఎల్‌పీ’ త్వరితగతిన పూర్తి చేయండి

మంత్రికి విన్నవించిన ఎమ్మెల్యేలు



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యేలు

పరిగి: పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టులో భాగమైన (కేపీఎల్‌పీ)కొందుర్గు, పరిగి, లక్ష్మీదేవిపల్లి ప్రాజెక్టును త్వరగా పూర్తిచేయాలని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని డీసీసీ అధ్యక్షుడు, పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డి కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన నగరంలోని మంత్రి కార్యాలయంలో తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, షాద్‌నగర్ ఎమ్మెల్యే ఈర్లపల్లి శంకర్‌లతో కలసి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వం ఉమ్మడి రంగారెడ్డి జిల్లాకు తీవ్ర అన్యాయం చేసిందన్నారు. సాగునీరు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇందుకు స్పందించిన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వంలోనే రైతులకు అన్ని రకాల సంక్షేమాలు అందుతాయన్నారు. త్వరలోనే పనులను ప్రారంభించి రైతులకు నీరందించే విధంగా కృషి చేస్తామని తెలిపారు.

మగ్గం వర్క్‌పై ఉచిత శిక్షణ

మోమిన్‌పేట: మహిళలకు ఉచితంగా జర్దోసి మగ్గం వర్క్‌లో శిక్షణ ఇవ్వనున్నట్లు బ్రెడ్ (బ్యాంకర్ల గ్రామీణ ఔత్సాహికుల అభివృద్ధి సంస్థ) స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటరు సత్తయ్య ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో ఈ నెల 16న ఉదయం 9.30గంటల నుంచి సాయంత్రం 4.30ల వరకు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణకు హాజరయ్యే మహిళలు 18 నుంచి 40 సంవత్సరాలలోపు ఉండి మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను, ఆధార్ కార్డుతో హాజరు కావాలని సూచించారు. ఉచిత భోజనం, మెటీరియల్స్ సౌకర్యం ఉంటుందని చెప్పారు. మరింత సమాచారం కోసం 9949104515 నంబరులో సంప్రదించాలన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి చర్యలు తీసుకోవాలి

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్ రెడ్డి

షాద్‌నగర్: ప్రభుత్వ పథకాల్లో దివ్యాంగులకు ఐదు శాతం ప్రత్యేక వాటా కేటాయించాలని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. షాద్‌నగర్ పట్టణంలోని బుగ్గారెడ్డి గార్డెన్‌లో ఆదివారం దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) జిల్లా కమిటీ అధ్యక్షుడు ఆశన్నగారి భుజంగరెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి మూడో మహాసభ నిర్వహించారు. ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి, ఎన్‌పీఆర్‌డీ రాష్ట్ర అధ్యక్షుడు కరువునెల్లి వెంకట్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. రోజురోజుకూ పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా పెన్షన్ రూ.6,016కు పెంచాలని, ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న బ్యాక్‌లాక్ పోస్టుల భర్తీ కోసం వెంటనే నోటిఫికేషన్ వేయాలని, గ్రామ పంచాయితీ, అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల ద్వారా దివ్యాంగుల సమగ్ర సమాచారం సేకరించాలని డిమాండ్ చేశారు. కరువునెల్లి వెంకట్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం దివ్యాంగుల సంక్షేమానికి కేటాయించే నిధులు దారి మళ్లుతున్నాయని ఆరోపించారు. అనంతరం ఎమ్మెల్సీ నవీన్‌కుమార్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. సమావేశంలో నాయకులు రాజు, శేఖర్, నాగార్జున, శ్రీనివాస్, మహేశ్‌గౌడ్, బాల్‌రాజ్, యాదయ్య, బోడ శ్రీనివాస్, జానయ్య, నర్సింహ తదితరులు పాల్గొన్నారు.





ఫొటోలకు ఫోజులిస్తున్న యువతులు



కాయకింగ్ బోటింగ్ సిబ్బందితో కలెక్టర్ ప్రతీక్‌జైన్

కోట్‌పల్లి ప్రాజెక్టుకు జనకళ

కోట్‌పల్లి ప్రాజెక్టులో పర్యాటకులు సందడి చేశారు. ఆదివారం సెలవురోజు కావడంతో పెద్ద ఎత్తున తరలివచ్చారు. కలెక్టర్ ప్రతీక్‌జైన్ కుటుంబ సమేతంగా విచ్చేసి ఆనందంగా గడిపారు. పర్యాటకులతో పాటు వారు బోటింగ్ చేశారు. అనంతరం కాయకింగ్ కోఆర్డినేటర్ రాములు, సిబ్బందితో ముచ్చటించి ఫొటోలు దిగారు. పర్యాటకులు సంతోషంగా గడిపి సాయంకాలం వెనుదిరిగారు.

– ధారూరు



కుటుంబ సమేతంగా బోటింగ్ చేస్తున్న కలెక్టర్



బుద్దారం-గాజీపూర్ వంతెనను ప్రారంభిస్తున్న మహేందర్‌రెడ్డి (ఫైల్)

వంతెన నిర్మించినా..
వెతలు తీరలే!

బ్రిడ్జిపై తేలిన ఇనుప రాడ్లు

- గుంతలమయంగా రహదారి
- పట్టించుకోని పాలకులు
- ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

పెద్దేముల్: ప్రజల ఇబ్బందులు తీర్చేందుకు గత ప్రభుత్వం తాండూరు-సంగారెడ్డి ప్రధాన రహదారిపై వంతెన నిర్మాణానికి పూనుకుంది. అప్పటి మంత్రి మహేందర్‌రెడ్డి చేతుల మీదుగా పనులను ప్రారంభించారు. శరవేగంగా నిర్మించినా నాణ్యతా లోపంతో వంతెనపై ఇప్పటికే ఇనుప రాడ్లు తేలాయి.




గాజీపూర్ వంతెన దుస్థితి

పనుల వివరాలు	
పనులు ప్రారంభించిన సంవత్సరం	2016
అంచనా వ్యయం	రూ.8.90కోట్లు
ప్రారంభించిన తేదీ	2023 అక్టోబర్ 9న

చిన్నపాటి వర్షానికి గుంతలమయంగా మారి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ఆరు నెలలకే అధ్వానం

తాండూరు-సంగారెడ్డి ప్రధాన రహదారిపై నిర్మించిన బ్రిడ్జి ఆరు నెలలకే అధ్వానంగా తయారైంది. బుద్దారం-గాజీపూర్ వంతెనపై ఇనుప రాడ్లు తేలాయి. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని ప్రయాణం సాగిస్తున్నా పట్టించుకునే వారే లేరని పెద్దేముల్, కోటపల్లి, మోమిన్‌పేట, తట్టెపల్లి, మారేపల్లి, గాజీపూర్, నాగులపల్లి తదితర గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళ ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రాణాలకే ప్రమాదమని ఆందోళన చెందుతున్నారు. వంతెన ప్రారంభోత్సవం చేయకముందే ఇనుపరాడ్లు తేలాయని.. ఆర్‌అండ్‌బీ అధికారులకు, పాలకులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ప్రయాణికులు మండి పడుతున్నారు. ప్రభుత్వం రోడ్ల మరమ్మతులకు



బుద్ధారం వంతెనపై తేలిన ఇనుప చువ్వలు

కోట్ల రూపాయల నిధులు మంజూరు చేస్తున్నామని చెప్పడం కాగితాలకే పరిమితమవుతోందని ఆరోపిస్తున్నారు. తాండూరు-సంగారెడ్డి, తాండూరు-ఇందూరు, తాండూరు-హైదరాబాద్ ప్రధాన రహదారులు అడుగడుగునా గుంతలు పడి ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నా ప్రభుత్వం కనీస మరమ్మతులు చేయక పోవడం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గత ప్రభుత్వంలో కనీసం సమావేశాలకు సంబంధిత అధికారులు వచ్చేవారని.. మూడు నెలలుగా ఆర్‌అండ్‌బీ అధికారులు ఎక్కడ ఉన్నారో తెలియని దుస్థితి దాపురించిందని వాపోతున్నారు. తాండూరు నుంచి ముంబై లింక్ ఉన్న సంగారెడ్డి మార్గంలో నిత్యం వేల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇలాంటి రోడ్ల అభివృద్ధి మరవడం సరికాదని ప్రయాణికులు మండి పడుతున్నారు. ఇదే విషయమై ఆర్‌అండ్‌బీ అధికారులను వివరణ కోరాగా అందుబాటులోకి రాలేదు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వంతెన మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

రేపే జాతర

- ఆరు రోజులపాటు అనంత పద్మనాభ స్వామి ఉత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయాధికారులు



అనంతగిరి: అనంతగిరి గుట్టలో వెలసిన శ్రీ అనంత పద్మనాభ స్వామి ఆలయం ఆషాఢ మాసం చిన్న జాతర ఉత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఏడాదికి రెండు సార్లు జాతర ఉత్సవాలు జరుగుతాయి. వికారాబాద్ పట్టణానికి 6 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఈ ఆలయంలో ఆషాఢ మాసంలో ఆరు రోజుల పాటు చిన్న జాతర, కార్తీక మాసంలో 16 రోజుల పాటు పెద్ద జాతర నిర్వహిస్తారు. ఆషాఢ శుద్ధ దశమిన ప్రారంభమై పౌర్ణమి రోజు ఈ ఉత్సవాలు ముగుస్తాయి. మంగళవారం సాయంత్రం 5 గంటలకు ధ్వజారోహనంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 17న బుధవారం ఏకాదశి చాతుర్మాస్య ఆరంభం ఉత్సవం జరుగుతుంది.

21న పెరుగు బసంతం

ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పౌర్ణమి నాడు మధ్యాహ్నం 2.30 గంటలకు గరుడ వాహన సేవ ఊరేగింపు అనంతరం పెరుగు బసంతం కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ జాతరకు వికారాబాద్ చుట్టు పక్కల ప్రాంతాలతో పాటు హైదరాబాద్, మహబూబ్‌నగర్, బీదర్, తాండూర్, సంగారెడ్డి, కర్నాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలి వస్తారు. జాతరకు ముఖ్య అతిథిగా స్థానిక ఎమ్మెల్యే, అసెంబ్లీ స్పీకర్ ప్రసాద్‌కుమార్ విచ్చేయనున్నారు. ఇప్పటికే ఆయనకు దేవాదాయ శాఖ అధికారులు ఆలయం తరుపున ఆహ్వాన పత్రిక అందజేశారు. జాతరకు వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ ఈఓ నరేందర్, ట్రస్టీ పద్మనాభం తెలిపారు.



స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను జాతరకు ఆహ్వానిస్తున్న ట్రస్టీ పద్మనాభం, ఈఓ నరేందర్

వృత్తిదారులకు అండగా ఉంటాం

- కల్లుగీత కార్మికులను ఆదుకుంటాం
- రాబోయే రోజుల్లో జిల్లా సమగ్రాభివృద్ధి
- స్పష్టం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- లష్కర్‌గూడలో ‘కాటమయ్య రక్షణ కవచం’ కిట్ల పంపిణీ
- తాటివనంలో స్వయంగా కిట్ల పనితీరు పరిశీలన
- కల్లుగీత కార్మికులతో మాటామంతి

అబ్దుల్లాపూర్‌మెట్: వృత్తిదారులకు అండగా ఉంటామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్‌గూడ గ్రామంలో వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ‘కాటమయ్య రక్షణ కవచం’ పేరుతో రూపొందించిన కిట్లను గీత కార్మికులకు అందజేశారు. సుమారు 500 మంది గీత కార్మికులకు కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఎం కల్లుగీత కార్మికులతో మాట్లాడి వృత్తిపరంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రమాదవశాత్తు మరణించిన కల్లుగీత కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. రాబోయే రోజుల్లో జిల్లాను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు.

తాటి వనంలో తిరిగి...

అంతకు ముందు స్పీకర్ గడ్డం ప్రసాద్, మంత్రులు శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్‌గౌడ్, ఎంపీ చామల కిరణ్ కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి తాటివనంలోకి చేరుకున్నారు. వృత్తిదారులు కిట్లను ధరించి, వాటి పనితీరును ప్రదర్శించగా సీఎం పరిశీలించారు. వాటిని రూపొందించిన హైదరాబాద్ ఐఐటీ విద్యార్థులు మాలోతు పూర్ణ బృందాన్ని అభినందించారు. వనమహోత్సవంలో భాగంగా ఈత మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పలువురు గీత కార్మికులు తాటి, ఈత చెట్లు అంతరించిపోతున్నాయని, ఈ వనాల కోసం ఐదెకరాల స్థలాన్ని కేటాయించాలని, వృత్తిదారులకు టీవీఎస్ మోపెడ్ వాహనాలు ఉచితంగా అందజేసి ఆదుకోవాలని విజ్ఞప్తి చేయగా ఆయన సుముఖత వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు యెగ్గె మల్లేశం, దయానంద్‌గుప్తా, ఏవీఎన్‌రెడ్డి, మహేశ్‌గౌడ్, మిర్యాలగూడ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, తెలంగాణ స్టేట్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, స్టేట్ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ చైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, పెద్ద అంబర్‌పేట్ మున్సిపల్ చైర్మన్ చెవుల స్వప్న, వైస్ చైర్మన్ చామ సంపూర్ణ, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దాసుగౌడ్ పాల్గొన్నారు.



నూతన కిట్లతో తాటి చెట్లు ఎక్కుతున్న గీత కార్మికులు



సీఎంకు మోకు, లొట్టి బహూకరిస్తున్న గౌడన్నలు

ఒక్క పైసా బెనిఫిట్ పొందలేదు

గత ప్రభుత్వ హయాంలో ఒక్క పైసా బెనిఫిట్ పొందని సామాజిక వర్గం ఏదైనా ఉందంటే అది కల్లుగీత కార్మికులే. రియల్ ఎస్టేట్ కారణంగా తాటి, ఈత చెట్లు లేకుండా పోయాయి. వృత్తి దెబ్బతింది. ప్రమాదవశాత్తు ఎవరైనా కార్మికుడు చెట్టుపై నుంచి కింద పడితే ఆ కుటుంబం అంతా చిన్నాభిన్నం అవుతుంది. హరితహారంలో భాగంగా నాటిన మొక్కల నుంచి ఆక్సిజన్ వస్తుందే కానీ ఆదాయం రావడం లేదు. ప్రస్తుత ప్రభుత్వం తాటిఈత వనాలకు ప్రాధాన్యత ఇస్తోంది.

– పొన్నం ప్రభాకర్, బీసీ సంక్షేమ శాఖ మంత్రి

కార్మికుల సంక్షేమానికి పెద్దపీట

కల్లుగీత కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోంది. ప్రాణనష్టం లేకుండా వారికి రక్షణ కిట్లను పంపిణీ చేస్తోంది. శ్రీలంకలో తాటిచెట్ల ద్వారా 80 రకాల ఉత్పత్తులను తయారు చేస్తున్నారు. మన దగ్గర కూడా ఇలాంటి ఉత్పత్తులకు ప్రాధాన్యత ఇస్తాం. నిరుద్యోగులకు ఉపాధి కల్పిస్తాం.

– జూపల్లి కృష్ణారావు, ఎక్సైజ్‌శాఖ మంత్రి

ఆ పరిశ్రమలకు ప్రాధాన్యత కల్పిస్తాం

వృత్తి ఆధారిత పరిశ్రమలకు ప్రాధాన్యత కల్పిస్తాం. వారికి అవసరమైన భూములు కేటాయించడంతో పాటు ఆర్థిక సహాయం కూడా చేస్తాం. గీతకార్మికుల పిల్లలకు ఆయా అంశాల్లో నైపుణ్యం కల్పిస్తాం.

– డి.శ్రీధర్‌బాబు, ఐటీశాఖ మంత్రి

ఐటీ పరిశ్రమలు రావాలి

విజయవాడ జాతీయ రహదారి వెంట ఐటీ, అనుబంధ పరిశ్రమలను ఏర్పాటు చేయాలి. స్థానికంగా ఉన్న యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి. కోహెడ పండ్ల మార్కెట్‌ను త్వరితగతిన పూర్తి చేయాలి.

– మల్‌రెడ్డి రంగారెడ్డి, ఎమ్మెల్యే, ఇబ్రహీంపట్నం

క్లుప్తంగా

వర్షాలతో అప్రమత్తంగా ఉండండి

కలెక్టర్ ప్రతీక్ జైన్

అనంతగిరి: జిల్లాకు మోస్తారు నుంచి భారీ వర్షా సూచన ఉన్నందున ప్రస్తుతం ఆరంజ్ అలర్ట్ ప్రకటించామని కలెక్టర్ ప్రతీక్ జైన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భారీ వర్షాలతో రోడ్లు కొట్టుకుపోవడం, ఉద్యాన పంటలు, ప్రాణ నష్టం వంటివి జరగకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ మేరకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజలు అత్యవసర సహాయం కోసం విపత్తుల నిర్వహణ సంస్థ అందుబాటులో ఉంటుందని తెలిపారు. అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తమై తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

గ్రామాల్లో మొహర్రం సందడి



చావిడిలో అలంకరణలో ఉన్న పీర్లు

బొంరాస్‌పేట: గ్రామాల్లోని ప్రధాన కూడళ్లలో ఉన్న మసీదులు, చావిడిల్లో పీర్లను ప్రతిష్టించారు. మండలంలోని బురాన్‌పూర్, బొంరాస్‌పేట, రేగడిమైలారం, వడిచర్ల, మెట్లకుంట, కొత్తూరు, చౌదర్‌పల్లి తదితర గ్రామాల్లో కుల, మత భేదాలు లేకుండా మొహర్రంను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అలై చుట్టూ పురుషులు ఆడుకోవడం జరుగుతోంది. సవారీలకు భక్తిశ్రద్ధలతో మొక్కుబడులు చెల్లించుకుంటున్నారు. తొమ్మిదో రోజు ఆదివారం ముస్లింలు ప్రత్యేక పూజలు చేశారు.

నిల్వ గంజాయి పట్టివేత



గంజాయి స్వాధీనం చేసుకున్న ఎక్సైజ్ పోలీసులు

పూడూర్: నిల్వ ఉన్న 750 గ్రాముల గంజాయిని విశ్వసనీయ సమాచారం మేరకు ఎక్సైజ్ అధికారులు పట్టుకున్న సంఘటన పూడూర్ మండలంలో చోటు చేసుకుంది. జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. జిల్లా ఎక్సైజ్ అధికారి విజయభాస్కర్ ఆదేశాల మేరకు శనివారం మధ్యాహ్నం మండలంలోని మిర్జాపూర్ గ్రామంలో గంజాయి నిల్వలు ఉన్నాయని విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బందితో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో మహ్మద్ ఆసిఫ్ ఇంట్లో 300 గ్రాముల ఎండు గంజాయి లభించింది. అనంతరం అతడు ఇచ్చిన సమాచారం మేరకు చేవెళ్ల మండలం అంతారం గ్రామంలోని షేర్‌ఖాన్ ఇంట్లో సోదాలు చేపట్టారు. అతని వద్ద నుంచి 300 గ్రాముల ఎండు గంజాయి, 150 గ్రాముల గంజాయి విత్తనాలు లభించాయి. ఇద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఈ దాడుల్లో ఎస్‌ఐ ప్రేమ్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది విష్ణువర్ధన్, హనుమంతు, శివప్రసాద్, రవికిరణ్ తదితరులు ఉన్నారు.

తల్లిదండ్రులు మందలించారని..

బాలుడి ఆత్మహత్య



శుభంకుమార్ మృతదేహం

కొత్తూరు: మద్యానికి బానిసైన కొడుకుని తల్లిదండ్రులు మందలించడంతో రైలు పట్టాలపై ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన కొత్తూరు పట్టణంలో చోటుచేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. తల్లిదండ్రులతో కలిసి పట్టణంలో నివాసం ఉంటున్న శుభంకుమార్(17).. కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. ఇది సరైంది కాదని కన్నవారు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన కుమార్.. ఈ నెల 13న సాయంత్రం ఇంటి నుంచి వెళ్లి.. ఆదివారం రైలు పట్టాలపై శవమై కనిపించాడు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా.. మృతున్ని గుర్తించారు. ఆత్మహత్యగా అనుమానించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

షాదీఖానా.. సమస్యల బందీఖానా!

కొరవడిన మౌలిక వసతులు
- శిథిలావస్థకు చేరిన మైనార్టీ ఫంక్షన్ హాల్
- నూతన భవనం నిర్మించాలని వినతులు
- నేడు ధర్నాకు పిలుపునిచ్చిన ఎంఐఎం నాయకులు



కొడంగల్ రూరల్: మైనార్టీల సౌకర్యార్థం కొడంగల్ పట్టణ కేంద్రంలో నిర్మించిన షాదీఖానా శిథిలావస్థకు చేరింది. దీంతో నూతన భవనాన్ని నిర్మించాలని అధికారులకు ఎన్నోసార్లు వినతులు అందించినా పట్టించుకోవడంలేదని స్థానిక ముస్లింలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 23 ఏళ్ల క్రితం షాదీఖానా నిర్మించగా సరైన సౌకర్యాలు లేకపోవడంతో వృథాగా మారింది. నీటి సౌకర్యం, విద్యుత్ సరఫరా, ప్రహరీ, మరుగుదొడ్లు తదితర సౌకర్యాలు లేకపోవడంతో నిరుపయోగంగా మారింది. షాదీఖానాలో ఓ హాలు మాత్రమే నిర్మించారని, వంట గది, టాయిలెట్ల వసతులు లేకపోవడంతో వినియోగించుకోలేని దుస్థితి ఏర్పడిందని స్థానికులు పేర్కొంటున్నారు. మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో షాదీఖానా లేకపోవడంతో గ్రామాల్లోని మైనార్టీలు శుభ కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించుకునేందుకు వీల్లేకుండా పోయిందని వాపోతున్నారు.

అవస్థలు పడుతున్న ముస్లింలు

పట్టణంలోని పలు ఫంక్షన్ హాళ్లలో మైనార్టీలు వివాహాలు, సమావేశాలు నిర్వహించాలంటే అధిక మొత్తంలో అద్దెలు చెల్లించాలి. కానీ పేద, మధ్య తరగతి ముస్లింలు కుటుంబాలు అద్దెలు ఇవ్వలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. ప్రస్తుతం ఉన్న షాదీఖానా వాడుకలో లేకపోవడంతో తలుపులు, కిటికీలు ధ్వంసమయ్యాయి. గత ప్రభుత్వం నుంచి వినతులు అందిస్తున్నా పట్టించుకోవడంలేదని వాపోతున్నారు. ఇటీవల అధికారులకు మొర పెట్టుకున్నా స్పందించడం లేదని ఆవేదన చెందుతున్నారు. నియోజకవర్గంలో దాదాపు 33 వేల మంది ముస్లింల జనాభా ఉంది. నియోజకవర్గ కేంద్రంలో షాదీఖానా నిర్మిస్తే గ్రామీణప్రాంత నిరుపేద ముస్లింలకు ఇబ్బందులు తొలుగుతాయని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. శిథిలావస్థకు చేరిన షాదీఖానా ఆవరణలో ముళ్ల కంపలు మొలుస్తుంటాయని, అధికారులు వచ్చి చూసే సమయంలో మాత్రమే వాటిని తొలగిస్తూ పరిసరాలలో శుభ్రం చేయడం తప్పిస్తే నూతన నిర్మాణం దిశగా అడుగులు పడడంలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫంక్షన్‌హాలు మాదిరి అన్ని వసతులు కల్పిస్తూ నూతన భవన నిర్మాణం చేపట్టాలని ప్రజాప్రతినిధులు డిమాండ్ చేస్తున్నారు.

షాదీఖానా ఎదుట ధర్నా

శిథిలావస్థకు చేరిన షాదీఖానాకు నూతన భవన నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని సోమవారం షాదీఖానా ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు ఎంఐఎం నాయకులు పేర్కొన్నారు. ధర్నాకు అధిక సంఖ్యలో కార్యకర్తలు, మైనార్టీలు పాల్గొని విజయవంతం చేయాలని పేర్కొన్నారు.

“ నూతన భవనం నిర్మించాలి



షాదీఖానాకు అప్పట్లో సరైన వసతులు లేకపోవడంతో వృథాగా మారింది. ప్రస్తుతం శిథిలావస్థకు చేరడంతో నిరుపేద ముస్లింలు వివాహ వేడుకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తక్షణమే అధికారులు మౌలిక వసతులతో నూతన భవన నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలి.

– ఎస్‌బి.గుల్షన్, ఎంఐఎం నియోజకవర్గ అధ్యక్షుడు

పత్తిలో పూత పద్ధతి మేలు

మండల వ్యవసాయధికారి జయశంకర్



మోమిన్‌పేట: పత్తిలో వస్తున్న పేను బంక, దోమల నివారణకు పూత పద్ధతి ఎంతో మేలని మండల వ్యవసాయాధికారి జయశంకర్ పేర్కొన్నారు. మొదట మందులను పిచికారీ చేయడం, నీరు, కూలీల ఖర్చులను రైతులు అధిగమించేందుకు ఈ పద్ధతి మంచిదన్నారు. దీనికి తోడు పిచికారీ చేయడంతో వాతావరణ కాలుష్యం ఏర్పడుతుందన్నారు. వర్షాభావ పరిస్థితిలో పొలాల వద్ద నీరు లేక ట్యాంకర్ల ద్వారా నీటిని తీసుకెళ్లి పిచికారీ చేస్తుండటంతో రైతులకు అదనపు ఖర్చులు వస్తాయన్నారు. కూలీలు, అదనపు పెట్టుబడుల నుంచి రక్షించుకొనేందుకు పూత పద్ధతి సులువైనదని ఆయన తెలిపారు.

విత్తిన 40 రోజులకే..

పత్తిని విత్తుకొన్న 40 రోజుల నుంచి పేను బంక, దోమలు పత్తిని ఆశించి రసం పీల్చి ఎదుగుదలను ఆపేస్తాయి. దీంతో రైతుకు నష్టం వాటిల్లుతుంది. విత్తిన 40, 60 రోజులకు రెండుసార్లు పత్తిలో పూత పద్ధతి ద్వారా రసం పీల్చే పురుగులను అరికట్టవచ్చన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో పెయింటింగ్ రూలర్‌లు అందుబాటులో ఉన్నాయి. రసం పీల్చే పురుగుల నివారణకు 100 గ్రాముల ఎసిఫేట్ మందులో 400 మి. లీటరుల నీటిని కలిపి రూలర్ ద్వారా పత్తి కాండంపైన పూత పూయాలి. ఎకరాకు 100 గ్రాముల మందు సరిపోతుంది. ఈ పూత పద్ధతి ద్వారా మందు, నీళ్ల, కూలీల కొరతను అధిగమించవచ్చు.



పత్తికి పూత పద్ధతిన మందు పూస్తున్న యువకులు (ఫైల్)

కిరాణ దుకాణంలో చోరీ

పెద్దేముల్: గుర్తుతెలియని వ్యక్తులు ఓ కిరాణషాప్‌లో చోరీకి పాల్పడిన సంఘటన ఆదివారం పెద్దేముల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ గిరి తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని జనగాం గ్రామంలో పాఠశాల పక్కన బాలరాజు కిరాణ షాపును కొంత కాలంగా నడుపుతున్నాడు. రోజు మాదిరిగా శనివారం సాయంత్రం షాపును మూసేసి ఆయన ఇంటికి వెళ్లాడు. మరుసటి రోజు ఉదయం షాపునకు వచ్చి తాళం తీసి చూడగా సామగ్రి చిందరవందరగా పడి ఉన్నాయి. దుండగులు రాత్రిపూట షాపులోకి చొరబడి రూ.2,500 నగదు, 10 లీటర్ల డీజిల్‌తో పాటు సుమారు రూ.6,500 విలువ గల వస్తువులు ఎత్తుకెళ్లారు. ఈ మేరకు బాల్‌రాజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

సైబర్ మోసాలతో జాగ్రత్త

ఏఎస్‌ఐ సూర్యనారాయణ

దోమ: గ్రామీణులు ఆన్‌లైన్ మోసాలు, దొంగతనాల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఏఎస్‌ఐ సూర్యనారాయణ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో ఎస్‌ఐ ఆనంద్ కుమార్ ఆదేశాల మేరకు సైబర్ మోసాలు, దొంగతనాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలంతా ఫోన్‌లు, సోషల్ మీడియాలో వచ్చే అనవసరమైన లింకులను ఓపెన్ చేయొద్దని సూచించారు. వాటిని ఓపెన్ చేయడంతో సైబర్ కేటుగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారన్నారు. ముఖ్యంగా మొబైల్ ఫోన్‌లకు కొంత కాలంగా వివిధ బ్యాంకుల పేరుతో లింకులు వస్తున్నాయన్నారు. ఓటీపీల ద్వారా కేటుగాళ్లు అకౌంట్లలో ఉన్న డబ్బులను కాజేస్తున్నారన్నారు. ప్రతిఒక్కరూ దొంగలు, సైబర్ కేటుగాళ్ల పట్ల తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కానిస్టేబుల్స్ హీరాలాల్, నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చోరీలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్‌ఐ సూర్యనారాయణ



అడవిలో విహరిస్తున్న సందర్శకులు



మహానంది వద్ద ఫొటోలు తీసుకుంటున్న మహిళలు

అనంతగిరి.. సేదతీరి

సెలవురోజు పర్యాటకుల తాకిడి

అనంతగిరి: నగరానికి చేరువలో ఉన్న అనంతగిరి గుట్టకు ఆదివారం పర్యాటకులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. సెలవుదినం కావడంతో చిన్నా, పెద్దా అందరు కలిసి ప్రకృతి అందాలను తిలకించారు. ఉదయం స్వామి వారిని దర్శించుకొని అనంతరం వ్యూ పాయింట్, నందిఘాట్, అడవిలో పచ్చని అందాలను తిలకిస్తూ కుటుంబీకులు, స్నేహితులతో సరదాగా మధ్యాహ్నం వరకు గడిపారు. భోజనాలు చేసుకుని అక్కడి నుంచి కోట్‌పల్లికి తరలారు. సాయంత్రం కాగానే తమ స్వస్థలాలకు పయనమయ్యారు.



నందిఘాట్‌కు వరుస కట్టిన పర్యాటకులు

సైకిల్‌ను ఢీకొన్న వాహనం

వ్యక్తి మృతి



బాల్‌రాజ్ (ఫైల్)

చేవెళ్ల: సైకిల్‌ను గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిన ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధి దామరగిద్ద బస్‌స్టేజీ, హెచ్‌పీ పెట్రోల్ పంపు సమీపంలో శనివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి హస్తేపూర్ గ్రామానికి చెందిన కె.బాల్‌రాజ్(36) రేషన్ డీలర్‌గా పనిచేస్తున్నాడు. కుటుంబ కలహాల నేపథ్యంలో దంపతులు గొడవపడ్డారు. దీంతో బాల్‌రాజ్ ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లిపోయాడు. ఈ క్రమంలో బస్టాప్ సమీపంలో సైకిల్‌పై వెళ్తున్న అతన్ని గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో డీలర్ తీవ్రగాయాలతో పడున్నాడు. రాత్రి వేళ ఎవరూ గుర్తించకపోవడంతో అటుగా వెళ్తున్న వాహనదారులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు పోలీసులు క్షతగాత్రున్ని చేవెళ్ల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తొలుత గుర్తు తెలియని వ్యక్తిగా భావించగా.. ఆదివారం స్థానికులు కొందరు హస్తేపూర్ రేషన్ డీలర్‌గా గుర్తించారు. అనంతరం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతుడి భార్య రాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రజాభవన్‌లో ‘సూర్యగిరి’ ఘటం



పూజారి నెత్తిన ఘటాన్ని, పెడుతున్న సీఎం, డిప్యూటీ సీఎం

మహేశ్వరం: తెలంగాణ ప్రజాభవన్‌లో కొలువు దీరిన నల్ల పోచమ్మ బోనాల పండుగ ఆదివారం ఘనంగా జరిగింది. ఈ ఉత్సవంలో మహేశ్వరం మండలం రావిర్యాల సూర్యగిరి రేణుకా ఎల్లమ్మ ఘటాన్ని.. ఆ ఆలయ ప్రధాన పూజారి మీగడ రామస్వామి కుమారుడు కాశీనాథ్.. సర్వాంగ సుందరంగా అలంకరించి ఊరేగించారు. వేడుకలో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు కొండా సురేఖ, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్ గౌడ్, జూపల్లి కృష్ణా రావులు ఘటానికి ప్రత్యేక పూజలు చేసి, అమ్మవారి ఆశీర్వాదం తీసుకున్నారు. మంత్రుల ఆధ్వర్యంలో జరిగిన బోనాల పండుగలో రావిర్యాల ఎల్లమ్మ ఘటానికి మంత్రులు పూజలు చేయడం, వారి సమక్షంలో ఘటాన్ని ఎత్తుకోవడం సంతోషంగా పూజారి కాశీనాథ్ అన్నారు.

పండ్ల చెట్లకు ‘బంక’

- తెగుళ్ల నివారణకు చర్యలు
- సస్యరక్షణకు నిపుణుల సలహాలు



జి.శ్రీకృష్ణ, కృషి విజ్ఞాన్ కేంద్రం క్రీడా నిపుణుడు

కందుకూరు: మామిడి, జామ, సపోట, బత్తాయి, నిమ్మ తదితర పండ్ల చెట్ల కాండంపై బంక తెగుళ్లు సోకి పంటలకు నష్టం వాటిల్లితోంది. ఈ నేపథ్యంలో తెగులు నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, చేపట్టాల్సిన సస్యరక్షణ గురించి కృషి విజ్ఞాన్ కేంద్రం క్రీడా నిపుణుడు జి.శ్రీకృష్ణ రైతులకు పలు సలహాలు, సూచనలు ఇచ్చారు.


ఫైటోఫ్తోరా..

బంక తెగుళ్లలో ఫైటోఫ్తోరా, డిప్లొడియా అని రెండు రకాలు ఉన్నాయి. ఫైటోఫ్తోరా తెగులుతో బంక కారటం, బెరడు కుళ్లడం చెట్టు వేళ్లకు, మొదలు కింది భాగానికి పరిమితమై ఉంటుంది. ఈ తెగులు సోకిన చెట్ల మొదలుపై, బెరడు నుంచి పైకి ధారాళంగా బంక కారుతుంది. బెరడు మీద కారిన ఈ బంక గట్టిపడి మట్టి రంగుగా మారుతుంది. ఇటువంటి బెరడు నల్లబడి నిలువుగా పగులుతుంది. ఈ బంకను గోకివేస్తే అడుగున ఉన్న కాండం భాగం కూడా కొంచెం కుళ్లినట్లు కనబడుతుంది. ఈ తెగులు భూమికి దగ్గరగా కాండం మీద ఆరంభమై, వేళ్ల మీదికి కూడా పాకుతుంది. అయితే వేళ్ల మీద బంక కారడం అంత స్పష్టంగా కనబడకపోవచ్చును. నీరు సరిగా ఇంకిన భూముల్లో తెగులు ఎక్కువగా వస్తుంది. అంట్లు చాలా కిందకు కట్టి, ఆ అంట్ల కలయిక మట్టికి తగిలేటట్లు, లేదా లోతుగా నాటినప్పుడు తడి మన్ను అంట్ల కలయిక మీద ఎక్కువగా ఉన్నప్పుడు ఈ తెగులు వ్యాపిస్తుంది.

డిప్లొడియా..

డిప్లొడియా బంక తెగులుతో చెట్టు మొదలు పై భాగాన, ముఖ్యంగా పంగల్లో బంక కారటం, బెరడు కుళ్లట గమనించవచ్చు. ఈ తెగులు సోకిన స్థలంపై బెరడు నల్లబడి, దాని కింద కొయ్య భాగం నల్లగా మారుతుంది. ఈ బంక తెగుళ్లతో కొమ్మలు ఎండుట, చెట్టు క్షీణించుట జరుగుతుంది. వేరు కుళ్లి నందు వలన చెట్టు ఎక్కువ పూత పట్టడం, కాయ ముదిరే లోపలే చెట్లు చచ్చిపోతుంటాయి.





బంక తెగులు సోకిన చెట్టు కాండం

నివారణ

మురుగు నీరు పోయే అవకాశమున్న పొలాల్లో బత్తాయి(చీనీ) చెట్లు నాటాలి. అంటు కలయిక మట్టిలో పూడిపోయేటట్లు లోతుగా నాటొద్దు. చెట్టు మొదలు చుట్టూ మట్టిని ఎగదోయొద్దు. చెట్టు చుట్టూ 1.5 అడుగుల దూరంలో పిల్లపాదు కట్టి, దానికి బయట మాత్రమే నీరు కట్టాలి. దీనినే డబుల్ రింగ్ పద్ధతిగా పిలుస్తారు. పారే నీరు రోగం ఉన్న చెట్టు నుంచి రోగం లేని చెట్టు పాదులోకి పారకుండా జాగ్రత్త పడాలి. పదునైన కత్తితో బంక కారి కుళ్లిన బెరడును పూర్తిగా గీకి, బోర్డోపేస్ట్ లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ పేస్టు పూయాలి. బత్తాయి చెట్లకు ఏటా మొదళ్లపై 2 అడుగుల ఎత్తు వరకు బోర్డోపేస్ట్ పూయటం మంచిది. పక్షం రోజులు వ్యవధిలో ఒక శాతం కార్బండజిమ్ మందును రెండు సార్లు చెట్టుపై కొమ్మలు తడిచేలా పిచికారీ చేసి, డిప్లొడియా బంక తెగుళ్లను అరికట్టవచ్చు.

సాక్షి క్లాసిఫైడ్స్

SERVICES

■ వ్యవసాయ, వ్యాపార, ప్రాపర్టీ మరియు వ్యక్తిగత కోసం అతి తక్కువ వడ్డీతో రుణాలు సిబిల్ అవసరం లేదు NPA కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. 9872006329. [T-263]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/ డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

స్కూటీ ఢీకొని.. వృద్ధురాలి దుర్మరణం

గచ్చిబౌలి: రోడ్డు దాటుతున్న ఓ వృద్ధురాలిని స్కూటీ ఢీ కొట్టడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. ఈ సంఘటన గచ్చిబౌలి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ భాను ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపూర్ శ్రీరాంగనర్ కాలనీకి చెందిన కామేశ్వరీ(60) ఆదివారం ఉదయం తమలపాకులు తెచ్చుకునేందుకు ఇంటి నుంచి బయటికి వచ్చింది. పాలపిట్ట సైకిల్ పార్క్ ఎదురుగా రోడ్డు దాటుతుండగా స్కూటీ ఢీకొట్టింది. తీవ్ర గాయపడిన ఆమెను.. ఓ ఆటో డ్రైవర్ కొండాపూర్ ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనలో ద్విచక్ర వాహన దారులకు గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తులో ఉంది.

తండ్రిపై తనయుడి దాడి

ఘట్‌కేసర్: డబ్బులు ఇవ్వాలని తండ్రిపై దాడికి పాల్పడిని కుమారుడిపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపిన వివరాల ప్రకారం.. అంకుషాపూర్ గ్రామానికి చెందిన చింతకింది శంకరయ్య తార్నాకలోని ఎన్‌ఐఎన్‌లో పని చేశాడు. ఇతనికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ప్రస్తుతం అతను భార్య లక్ష్మితో కలిసి గ్రామంలో నివాసం ఉంటున్నాడు శంకరయ్య పెద్ద కుమారుడు వేణుగోపాల్ కొన్ని రోజులుగా డబ్బుల కోసం తరచూ తండ్రితో గొడవ పడుతున్నాడు. శనివారం సాయంత్రం ఇంటికి వచ్చిన అతను తండ్రిపై దాడి చేశాడు. ఇదే విషయం శంకరయ్య తన సోదరుడు శ్రీనివాస్‌కు చెబుతుండగా.. అదే సమయంలో అక్కడికి వచ్చిన గోపాల్.. మరోసారి తండ్రిపై దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యం

డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి

కడ్తాల్: విద్యారంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తుందని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో రూ.3.50 కోట్ల వ్యయంతో నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను పలువురు పార్టీ నాయకులతో కలిసి ఆయన ఆదివారం పరిశీలించారు. విద్యాలయాన్ని ఈ నెల 17న ప్రారంభించనున్న నేపథ్యంలో ఏర్పాట్ల గురించి చర్చించారు. అనంతరం గూడూరు మాట్లాడారు. పాఠశాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, జూపల్లి కృష్ణారావు, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరు కానున్నారని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులు తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, నాయకులు బీక్యానాయక్, యాట నర్సింహ, బీచ్యానాయక్, వేణుగోపాల్, లక్ష్మయ్య, బాలరాజు, రామకృష్ణ, శంకర్, రాంచందర్‌నాయక్, జగన్‌గౌడ్, శ్రీను జవహర్, హీరాసింగ్, రాజేశ్, యాదయ్య, షాబుద్దీన్, శ్రీకాంత్ ఉన్నారు.



పాఠశాల వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకులు